


మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి / జోగులాంబ గద్వాల /నారాయణపేట

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్**



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి క్రైం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస మౌళిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశించారు. శుక్రవారం వనపర్తి జిల్లాలోని మున్సిపాలిటి, గ్రామ మండల స్థాయిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌళిక సదు పాయాలు పరిశీలించారు. వనపర్తి పట్టణంలోని ఊర్దు మీడియాం కళాశాలలో రెండు పోలింగ్ స్టేష న్లు, నూతన గ్రంథాలయంలో ఒక పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం పెద్ద మందడి మండలంలోని బలిజపల్లి గ్రామంలో 2 పోలింగ్ స్టేషన్లు, పామిరెడ్డిపల్లి గ్రామంలో 4 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పామిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లు సరిగ్గా లేవని, వాటిని వెంటనే మరమ్మత్తులు చేయించి అందుబాటులోకి తీసుకొని రావాలని ఆదేశించారు. వీరాయిపల్లి గ్రామంలో ఒక పోలింగ్ స్టేషన్, ఘనపురం మండలంలోని కోతులకుంట తాండలో ఒక పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. కోతులకుంట తాండాలో వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలని సంబంధిత ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఘనపురం మండల కేంద్రంలో 4 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీరు, సరైన వెలుతూరు, దివ్యాంగులకు ర్యాంప్ తదితర వసతులు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పెద్దమందడి ఘనపురం తహసీల్దార్ పాండు, ఎంపీడీఓలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

# రైతులు నిబంధనలు పాటించాలి...

**- అదనపు కలెక్టర్ కె.సీతారామావు**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కె.సీతారామావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** జిల్లాలోని పత్తి రైతులు పత్తిని అమ్మే సందర్భంలో అధికారులు సూచించిన నిబంధనలను పాటించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై మార్కెటింగ్ సీపీఐ, రవాణా శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి గాను కేంద్రప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.7020 కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. సీపీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని అమ్మకానికి తీసుకొనివచ్చేటప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, పట్టా పహాని జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలని సూచించారు. పత్తిని బాగా శుభ్రపరిచే తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండేటట్లుగా చూసుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లు యజమాన్యాలు, సీపీఐ అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం వరి కొనుగోళ్లపై కూడా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు 230 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. డీఆర్‌డీఏ నుంచి 15 వరి కొనుగోలు కేంద్రాలు, పీఎస్‌ఈఎస్ నుంచి 215 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏ గ్రేడ్ క్వింటాలు వరికి రూ.2203 మద్దతు ధర, రెండో రకానికి క్వింటాల్‌కు రూ.2183 ఉన్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ నుంచి జరిగే వరి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జయకుమార్, సీపీఐ డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ అధికారిణి బాలమణి, ఆర్టీఓ ఎర్రిస్వామి, ఇన్‌చార్జి డీఎస్ఓ స్వామికుమార్, డీసీఓ పత్యానాయక్, పీడీ డీఆర్డీఏ నర్సింగరావు, ఫైర్ అధికారి కృష్ణమూర్తి, అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులయ్యే చేరికలు

**■ దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**





ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఇతర పార్టీల నాయకులు,కార్యకర్తలు

**భూత్పూర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం అన్నాసాగర్, భూత్పూర్ గ్రామాల బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అధికార పార్టీ బీఆర్ ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆల పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్శి తులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకుంటున్నారన్నారు. గత ఏడుదశాబ్దాల నుంచి ఏమి చేయని కాంగ్రెస్ పార్టీ నేడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటుకోసం లేనిపోని గ్యారంటీలను ప్రకటిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఏ పార్టీ తమ కోసం పనిచేస్తుందో తెలుసునని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం ఆహర్నిశలు శ్రమించే బీఆర్ఎస్ వైపే ప్రజలున్నారని అన్నారు. అన్నాసాగర్ క్యాంప్ కార్యాలయంలో దేవరకద్ర నియోజకవర్గం సీసీకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల సమక్షంలో గులాబీతీర్థం పుచ్చుకున్నారు. భూత్పూర్ పట్టణకేంద్రంలోని పదోవార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే ఆల, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి చైర్మన్ కదిరే శేఖర్‌రెడ్డిల సమక్షంలో అధికార పార్టీ బీఆర్ ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కురుమూర్తికి చెందిన గొల్లరాములు, జోగుకురుమూర్తి, రాజు, చంద్రన్న, రవి, కవిత, మెగులన్న, కార్తీక్, రాములు, మహేందర్, చంద్రయ్య, సుదాకర్, చిన్న మాసన్నతో పాటు మరో వంద మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. భూత్పూర్ మున్సిపాలిటీ పదో వార్డుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు విఠల్‌దాస్ చెన్నకేశవులు, కావలి చింతలయ్య, కృష్ణయ్య, శ్రీనివాసులు, చెన్నదాస్, తిరుపతయ్య, రంగయ్య, మ ల్లేష్, యాదయ్య, రాములుతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరేశేఖర్‌రెడ్డిలు బీఆర్ ఎస్‌లోక ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముడా డైరెక్టర్ సత్తూర్ చంద్రశేఖర్ గౌడ్‌నాయకులు సత్తూర్‌నారాయణగౌడ్, తూముశ్రీనివాస్‌రెడ్డి, బోరింగ్ నర్సింహులు, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్, గడ్డం యాదయ్య, సత్తూర్ అశోక్ గౌడ్, సత్తూర్ సురేష్‌గౌడ్, మాల విఠల్‌దాస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ ఎస్పీగా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నియామకం

**- ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిర్ణయం**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీనియర్ అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. బదిలీ అయిన వారిలో 9 మంది జిల్లా కలెక్టర్లు, 25 మంది పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు ఉన్నారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమించాలని, రి స్థానాల్లో ఇతర అధికారుల నియామకం కోసం ఒక్కొ పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లతో అవసరమైన జాబితాను గురువారం సాయంత్రం లోగా అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా నూతన ఎస్పీగా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఐపీఎస్‌ను ప్రభుత్వ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీగా గైక్వాడ్ వైభవ్ బాధ్యతలు చేపట్టారు.

# ఉదండాపూర్‌తో ఊపిరి..

- రిజర్వాయర్‌కు నీళ్లొస్తే జడ్చర్ల సస్యశ్యామలం
- పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మోటారు ప్రారంభంతో ఆశలు
- డిసెంబర్ నాటికి నీళ్లిచ్చేందుకు సర్కారు సన్నాహాలు..
- ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి





**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** పాలమూరు వెనుకబడ్డ జిల్లా, వలస జిల్లా. నీటి వనరులు అధికంగా ఉన్నా చెంతనే కృష్ణమ్మ పారుతున్నా సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా కనీసం తాగడానికి కూడా నీళ్ల రాలేదు. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. రైతుల ఆకాంక్షలకు ప్రాణం పోస్తూ ప్రజల అవసరాలను తీరుస్తూ పాలమూరు జిల్లా రైతుల పాదాలను తడిపేందుకు తెలంగాణ ప్రభుత్వం 2016 లో పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టడంతో సాగునీటి ఆశలకు పునర్జీవం వచ్చింది. ఇటీవల సీఎం కేసీఆర్ నార్లాపూర్ వద్ద మొదటి బాహుబలి మోటారు ప్రారంభించి సాగునీటిపై ఆశలను సజీవం చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మితమవుతున్న ఉదండాపూర్ జలాశయం పనులు కూడా చివరి దశకు చేరుకోవడంతో జడ్చర్లకు త్వరలోనే సాగునీరు అందనున్నది. నిర్వాసితులకు పునరావాస కల్పనతోపాటు వారికి అండగా ఉంటూ రిజర్వాయర్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయడంలోనూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాత్ర కీలకమని చెప్పవచ్చు. జడ్చర్ల నియోజకవర్గం సస్యశ్యామలం చేయడానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నడుం బిగించారు.. బీడు భూములకు కృష్ణా జలాలను తరలించేందుకు అన్ని తానై ముందుకు నడిచాడు. నియోజకవర్గంలో లక్షన్నర ఎకరాలకు నీళ్లందించడమే లక్ష్యంగా తొలి అడుగు వేశాడు.

**ఇవీ ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రత్యేకతలు..**

ఉదండాపూర్ జలాశయానికి సంబంధించి మొత్తం 5214ఎకరాలకు పైగా భూముల కేటాయింపు జరిపారు. రూ.6616.4కోట్ల ప్రతిపాదిత వ్యయంతో 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు డిజైన్ చేయబడింది. దీంతోపాటు హైదరాబాద్ లాంటి మహానగరం గొంతు తడిపేందుకు, సెజ్‌లోని ఫార్మా కంపెనీలకు, దివిటిపల్లి ఐటీ కారిడార్‌కు నీటివసతి కూడా కల్పించేందుకు అనుగుణంగా డిజైన్ చేయబడిన అతి భారీ రాజర్వాయర్ ఇది. రిజర్వాయర్‌ను 16,17,18 అని మూడు ప్యాకేజీలుగా విభజించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల లో భాగంగా 5వ రిజర్వాయర్‌గా, 16.03 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీతో ఉదండాపూర్ రూపుదిద్దుకుంటున్నది. జలాశయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

**పునరావాసం..**

రిజర్వాయర్‌లో సుమారు 2850 మందికి పైగా రైతులు, ప్రజలు తమ భూములను ఇండ్లను కోల్పోయిన నిర్వాసితులకు 316ఎకరాల భూమిని సేకరించి దేవుని గుట్టతండా వద్ద ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయగా పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. రూ.171.55 కోట్లతో నిరంతరంగా పనులు కొనసాగుతున్నాయి. రెండు టన్నెళ్లలో భాగంగా ఒక ఇప్పటికే పూర్తికాగా, రెండో టన్నెల పనులు 20శాంత తుదిదశలోమున్నాయి. జలాశయం పూర్తయితే ఆలూర్. బూరెడ్డిపల్లి శంకరాయపల్లి, పోలెపల్లి, తీగలపల్లి, ఉదండాపూర్, వల్లూరు, ఖానాపూర్, కిష్టారం, కారకొండ, సిద్ధోటం గ్రామస్తులతోపాటు చుట్టూ సస్యశ్యామలం అవుతాయి. ప్రాజెక్టు పూర్తయితే జడ్చర్ల నియోజకర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరందుతుంది. వ్యవసాయ బోర్లు రీచార్జి అవుతాయి. తాగు నీటి గోస శాశ్వతంగా తీరుతుంది. చెరువులు, కుంటలు జలకళ సంతరించుకుంటాయి.

**ప్యాకేజీల వారీగా పనులు..**

16వ ప్యాకేజీలో రూ.2049.02 కోట్ల విలువ చేసే పనులు జరుగుతున్నాయి. 17వ ప్యాకేజీలో బండ్ పనులు 0కి.మీ.నుంచి 6.300కి.మీ.వరకు కొనసాగుతున్నాయి. ప్యాకేజీ -18లో బండ్ పనులు 6.300 కి.మీ.నుంచి 15.875కి.మీ. వరకు నిర్వహించేందుకు రూ.2400 కోట్ల ప్రతిపాదన చేయగా రూ.2483.45 కోట్లకు రీషెడ్యుల్ చేశారు. రూ.1314.37కోట్ల పనులు పూర్తి కాగా రూ.1169.08కోట్ల పనులు పెండింగ్ పనులు ఉన్నాయి. భూముల కేటాయింపునకు సంబంధించి 16వ ప్యాకేజీలో 352-25 ఎకరాలు, 17వ ప్యాకేజీలో 1678-03 ఎకరాలు, 18వ ప్యాకేజీలో 3183-22.5 ఎకరాల చొప్పున మొత్తంగా 5214.10.5 ఎకరాలను సేకరించారు.

**లక్షాయాభైవేల ఎకరాలకు సాగునీరందిస్తాం..**

ఉదండాపూర్ సర్జిపూల్ పనులు, పంప్‌హౌజ్ పనులు పూర్తయ్యాయి. వీలున్న ప్రతి ఒక్కరూ రిజర్వాయర్‌ను సందర్శించి ఈ ప్రాంత రైతులపై ప్రభుత్వ చిత్తశుద్ధిని గమనించాలి. నార్లాపూర్‌లో సీఎం కేసీఆర్ మొదటి పంప్‌హౌజ్‌ను ప్రారంభించారు. డిసెంబర్ నెలాఖరుకు ఉదండాపూర్‌కు నీళ్లందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జడ్చర్ల నియోజకవర్గంలో లక్షాయాభైవేల ఎకరాలకు సాగునీరందించడం నా కల. ప్రాజెక్టుకునీళ్ల తెచ్చి రైతుల పాదాలను తడిపితే నా జన్మధన్యమవుతుంది. గత తొమ్మిదేండ్లలో తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో జడ్చర్ల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను గమనించి పని చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి.

**- డా. సీ లక్ష్మారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే**

| పనులు రకాలు | మొత్తం పనులు | పూర్తయినవి | శాతం |
|---|---|---|---|
| 1.గుంత తీసి మట్టి తీసే పనులు | 28.66 | 23.62 | 85.41 |
| 2.రాళ్లతో గోడ నిర్మాణం | 502.39 | 285.04 | 65.74 |
| 3.రివిట్‌మెంట్ పనులు | 24.53 | 14.67 | 75.80 |

# ఎన్నికల్లో మీడియా సెంటర్ పాత్ర కీలకం...

**- సద్వినియోగం చేసుకోవాలి...**

**- మీడియా సెంటర్‌లో ప్రారంభంలో కలెక్టర్ జి.రవినాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** ఎన్నికల్లో మీడియా సెంటర్ పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.రవి నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన సమీకృత జిల్లా అధికారి కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన రాష్ట్ర శాసనభస ఎన్నికల మీడియా కేంద్రాన్ని ప్రారంభించారు. మీడియా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా కమిటీల కార్య కలాపాలను సైతం కలెక్టర్ ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ విడదలైన అనంతరం ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వివిధ రకాల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని సరైన విధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని, ఇందులో భాగంగానే మీడియాద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారాన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలియజేసేందుకు మీడియా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కోసం చేసే ఏర్పాట్లతో పాటు ఎన్నికలకు నిర్వహించే విషయాలను, అదే విధంగా కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమాలను మీడియా కేంద్రం ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు వివిధ రాజకీయ పార్టీలు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో వచ్చే ప్రకటనల ముందస్తు అనుమతి కోసం ఎంసీఎంసీ ద్వారా అనుమతులను మీడియా సెంటర్ నుంచి పొందవచ్చని, అదే విధంగా సోషల్ మీడియా ద్వారానే వచ్చే సందేశాలు, వాటి అడిటింగ్‌కు మీడియా సెంటర్ పనికొసుత ందని తెలిపారు. మీడియా కేంద్రంలో అవసరమైన అన్ని సౌకర్యాలు అవసరమైతే ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీడియా కేంద్రం నుంచి మీడియాకు సమాచారాన్ని ఇవ్వడంతో పాటు మీడియా ప్రతినిధుల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు ఇది ఒక చక్కని వేదికలా ఉపయోగపడుతుందని, మీడియా ప్రతినిధులు మీడియా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల మొదలుకొని మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ఇంకా ఇతర కార్యక్రమాలను బయట నుంచి కవర్ చేసినప్పటికి జిల్లా స్థాయిలో నిర్వహించే అన్ని కార్యక్రమాలు, కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమాలు మీడియా కేంద్రం నుంచి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో మీడియా సైతం సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కే.వి.వి రవికుమార్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఇశ్రానాయక్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నారాయణ, మరో సభ్యులు ఈ-జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లు, ఫోటో, వీడియో జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.

# అర్హులందరికీ గృహలక్ష్మి అమలు..

**- సమష్టిగా కృషి చేస్తే లక్ష మెజార్టీ పక్కా: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**- బీఆర్‌ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు**



పార్టీలో చేరుతున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీలోకి నిరంతరంగా వలసలు కొనసాగుతున్నాయి. గత తొమ్మిదేండ్లలో చేపట్టిన అభివృద్ధికి సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెబుతున్నారు. శుక్రవారం రాజాపూర్‌మండల నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మంగళ యాదగిరి మంగలి ఆంజనేయులుతో సహా సుమారు 70మందికి పైగా రాజాపూర్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తలు, నాయకులు సమావేశంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాకముందు కనీసం తాగునీళ్లకు కూడా ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. అందరూ కలిసి సమిష్టిగా పని చేస్తే లక్ష మెజార్టీ రావడం పక్కా అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ చించోడ్ అభిమన్యురెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ పాల్గొన్నారు.

## నగదుకు ఆధారాలు ఉండాలి

**నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష**



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల నగదుకు సంబంధించి తప్పనిసరి ఆధారాలు ఉండాలని ఎన్నికల అధికారి కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వేలయిన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బ ృందాలు ,వీడియో వీవింగ్ బ ృందాలతో సమీక్ష నిర వ్హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లో బ ృందాలు యాక్టివ్‌గా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంకు మిత్తల్, అశోక్‌కుమార్, ఆర్డీవో రామచంద్ర, ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్ డీఆర్‌డీవో గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

## బీజేపీ పట్టణ అధ్యక్షులు బీఆర్‌ఎస్‌లో చేరిండు అనే తప్పుడు వార్తను ఖండిస్తున్న...

**- బీజేపీ పట్టణ అధ్యక్షులు నారాయణయాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణయాదవ్

**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** పాలమూరు పట్టణం 22వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వచ్చిన వార్త తప్పుడు వార్త అని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని బీజేపీ పాలమూరు పట్టణ అధ్యక్షులు నారాయణయాదవ్ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన కార్యకర్తలను కొందరు మంత్రి మెప్పు కోసం బీఆర్ఎస్ కండువాలు కప్పి మంత్రి చేత కప్పించి బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు సోషల్ మీడియాలో, ప్రతికల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేయడం తగదని హెచ్చరించారు. మంత్రి మందెవరో, తానెవరో ఎవరో గుర్తించి కండువాలు వేస్తే బాగుంటందని సూచించారు. బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన చూస్తుంటే పాలమూరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం చేస్తున్న కృషిని బీఆర్ఎస్ వాళ్లు గుర్తిస్తున్నారని అర్థమవుతుందన్నారు. పాలమూరులో బీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుందన్నారు. ఆ భయంతోనే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పి బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. పత్రిక సమావేశంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీశైలంయాదవ్, దోమ లక్ష్మినారాయణ, భగీరథ కాలనీ, శక్తి కేంద్రం ఇన్‌చార్జి దామరగిద్ద హరినాథ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ఖిల్లా పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన కలెక్టర్



తహసీల్దార్‌కు సూచనలు చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

**ఖిల్లాఘనాపురం, అక్టోబర్13ప్రభాతవార్త:** ఘనపూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్థానిక తహసీల్దార్ పాండుతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ తహసీల్దార్‌కు సూచనలిస్తూ ఘనాపురం మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి 42పోలింగ్‌స్టేషన్లు కాగా ప్రతిపోలింగ్ స్టేషన్‌లో విద్యుత్ కొరత లేకుండ చూడాలని, తాగడానికి నీరు, శానిటైజేషన్ సిబ్బందికి బాత్రూంలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని వారికి సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని రావాలని మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎస్ఐ శ్రీహరి, మండల రెవెన్యూ అధికారి గణేష్ తదితరులు ఉన్నారు.

ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో..

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

## -ఆటపాటలతో అలరించిన చిన్నారులు



బతుకమ్మలు మోస్తున్న చిన్నారులు

**భూత్పూర్, అక్టోబర్13, ప్రభాతవార్త:** ఆదివారం నుంచి జరిగే తెలంగాణ పూల పండుగ బతుకమ్మ వేడుకలు పాఠశాలలకు సెలవుల కారణంగా రెండ్రోజుల ముందుగా ఆయా పాఠశాలల్లో గురు, శుక్ర వారాల్లో చిన్నారి బాలలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో భూత్పూర్ పట్టణంలోని ఠాగూర్ మెమోరియల్ స్కూల్ చిన్నారి బాలబాలికలు శుక్రవారం తీరొక్క పువ్వులతో కన్నుల పండువగా బతుకమ్మలను పేర్చి మధ్యలో గౌర మ్మల నుంచి బతుకమ్మల చుట్టూ బొడ్డెమ్మలు, ఆటపాటలు నిర్వహించారు. అందంగా ముస్తాబై చిన్నారుల ఆటపాటలు పలువురిని ఆకర్షించాయి. బుతకమ్మ నిర్వహించిన బాలబాలికల్ని పాఠశాల కరస్పాండెంట్ గొడుగు వేదాంతం వెంకటయ్య, ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరితో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

**సాహితీ స్కూల్‌లో:** శుక్రవారం స్థానిక పట్టణ కేంద్రంలో ఉన్న సాహితీ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారుల ఆటపాటలను తిలకించారు. పాఠశాల కరస్పాండెంట్ సత్యం చైర్మన్‌కు పూలబొకే అందించి స్వాగతించారు.



సాహితీ స్కూల్‌లో బతుకమ్మను తెస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్



బతుకమ్మలు పేరుస్తున్న ఠాగూర్ స్కూల్ విద్యార్థినులు

## పీయూలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ పాలమూరు విశ్వవిద్యాలయంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను సంబురంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు అందరూ కలిసి బతుకమ్మ రంగుం రంగుల బతుకమ్మలతో ఆటా పాటలతో ఆడి పాడి సంబురాలు చేసుకున్నారు. అదే విధంగా బతుకమ్మలను ఆకర్షణీయంగా తయారు చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగానికి మొదటి బహుమతి, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో బహుమతి, ఎంఎస్‌డబ్ల్యూ, మ్యాథమెటిక్స్ సంయుక్తంగా తృతీయ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు బహుమతులు అంజేశారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి

### - ఎన్నికల అధికారి, కలెక్టర్ జి రవినాయక్



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్13, ప్రభాతవార్త:** పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల విషయమై తాసిల్దార్లు వారి పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు బీఎల్‌వోలు సూపర్‌వైజర్లతో వీసీ నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ రెండో విడుతలో భాగంగా ఆయా ఫారాలపై వచ్చిన అభ్యంతరాలను ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షిస్తూ ఈనెల31లోగా అభ్యంతరాలను పరిష్కరించాలని కోరారు.

ఎన్నికల వ్యయ వ్యవహారంపై పటిష్ట యంత్రాంగం: శాసన సభ ఎన్నికల సందర్భంగా డబ్బుల వ్యవహారానికి సంబంధించి పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ జి రవినాయక్ తెలిపారు. ఎవరైనా ఓటర్లకు నగతు రూపంలో కాని, వస్తు రూపంలో కాని ఇతరత్రా లంచం ఇవ్వడం ఇవ్వ జూపం లాంటి ఓటు హక్కుకు విఘాతం కలిగించేలా ప్రవర్తించడం చేస్తే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24గంటల పని చేసేలా ఏర్పాటు చేసిన ఫిర్యాదుల మానిటరింగ్ సెల్ నెంబర్‌ను 08542241165కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందువల్ల జిల్లా ప్రజలు ముఖ్యంగా ఓటర్లు ఎవరికైనా లంచం ఇవ్వడం తీసకోవడం వంటివి చేయొద్దని తెలిపారు.

## లక్ష్మీపల్లిలో వైభవంగా బతుకమ్మ సంబరం





**దేవరకద్ర, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని ప్రాథమిక పాఠశాలతో శుక్రవారం బతుకమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. దీంతో పాఠశాల ఆవరణ బతుకమ్మల సందడితో హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమంలో యంపీఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాసిద్, కల్పన, అశ్విని చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రాములు, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ, పాండమ్మలతో పాటు గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కొంగుబంగారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి...

**- ఈ నెల 15 నుంచి దసరా శరన్నవరాత్రోత్సవాలు...**

**- ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేసిన నిర్వాహకులు**



శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం



కన్యకాపరమేశ్వరి మూల విరాట్

**కల్వకుర్తి, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** గత 35 సంవత్సరాల నుంచి నేటి వరకు త్రికాలములందు దూప, దీప నైవేద్యములతో ఆధ్యాత్మిక కేంద్రంగా నిత్యం వేద పఠనములతో, మంత్రోచ్చారణలతో మహిమాన్వితముగా పవిత్రను చేకూర్చి పరిసర ప్రాంతాల్లో పేరుగాంచిన దేవాలయంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం వెలుగొందుతుంది. భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న శ్రీశ్రీశ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబులు అన్నారు. పది రోజుల పాటు ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు పూర్తి ఏర్పాట్లు చేశారు. అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఆది పరాశక్తియైన కన్యకాపరమేశ్వరి దేవిని ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ మాసము నందు పది దినములు పది అవతరాల్లో అలంకరించి పూజించించడం అనవాయితీ. ఈ నెల 15 నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబులు తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా రంగులతో, విద్యుద్ధీపాలతో, పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించామన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రతి ఏటా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులవుతారన్నారు.

**దేవి శరన్నవరాత్రోత్సవాల్లో అమ్మవారి అలంకరణలు...**

ఈ నెల 15న శ్రీ బాల త్రిపుర సుందీ దేవీ అలంకరణ, 16న శ్రీ గాయత్రి దేవి అలంకరణ, 17న శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణ, 18న ధనలక్ష్మి దేవీ అలంకరణ, 19న లలితా త్రిపుర సుందరి దేవీ అలంకరణ, 20న శ్రీ సరస్వత దేవి అలంకరణ, 21న సంతాన లక్ష్మీ దేవి అలంకరణ, 22న దుర్గాదేవి అలంకరణ, 23న విజయదశమి శ్రీ రజత వస్త్రాలంకరణ (వెండి చీర) పుష్పాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారని, 25న అమ్మవారికి ఊరేగింపు, అవబృంద స్నానము, ఉద్యాపన, సింహాద్రి అగ్రో మరియు శ్రీ లక్ష్మి రైస్ ఇండస్ట్రీస్‌లో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ రమేష్‌బాబు, దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్య క్షులు మాచిపెద్ది అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు బాదం రాఘు వేందర్, బాదం రాము, కోశాధికారులు శివ్వ శ్రీనివాసులు, అర్ధం కోటశ్వర్లు తెలిపారు. దేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



ఆలయ చైర్మన్ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు

## ఎమ్మెల్సీ కసిరెడ్డికి ఆహ్వాన పత్రం అందజేత...



ఎమ్మెల్సీకి, జెడ్పీ వైస్ చైర్మన్‌కు ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా సందర్భంగా నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లకు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా జూలూరి రమేష్‌బాబు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా దసరా పర్వదినాలను పురస్కరించుకొని ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతాయని, ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్సీ, జెడ్పీ వైస్ చైర్మన్‌లను కోరారు. అనంతరం ఎమ్మెల్సీ, జెడ్పీ వైస్ చైర్మన్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మాచిపెద్ది అశోక్, ప్రధాన కార్యదర్శి బాదం రఘు, కోశాధికారి డాక్టర్ శ్రీను, ఉత్సవ కమిటీ రైస్ మిల్లర్స్ నాయకులు ప్రవీణ్, రమణ, వీరేష్, తర్నికల్ శ్రీనివాస్, కోటేశ్వర్, తిరుపతయ్య, ఇరువెంటి రమేష్ తదితరులు ఉన్నారు.

## స్విట్స్‌లో ఘనంగా బతుకమ్మ సంబరం





స్విట్స్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపక బృందం, విద్యార్థులు

**దేవరకద్ర, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదన్‌పల్లి స్విట్స్ ఇంజనీర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కళాశాల ప్రిన్స్‌పాల్ పి.సుధాకర్ కార్యక్రమాన్ని ప్రారంభించా రు. వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించి విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. దీంతో కళాశాల ఆవరణ బతుకమ్మల సందడితో హోరెత్తిపోయింది. బతుకమ్మలను పేర్చిన విద్యా ర్థులకు బహుమతులను పంపిణీ చేశారు. దాదాపు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపక బృందం సభ్యులు, జయంతీ ఎడ్యుకేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిరంకుశ పాలనను గద్దె దించేందుకే కాంగ్రెస్‌లో చేరికలు...

### -కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశపాలనలో విసుగుచెందిన ప్రజలు సొంతపార్టీ కార్యకర్తలనే విస్మరించి ధనార్జనే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశతత్వాన్ని గద్దె దించడానికే బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తెల్కపల్లి మండలం దాసుపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు శివ ఆధ్వర్యంలో మరికొంత మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అలిసిపోయిన ప్రతి పౌరుడు కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం కృషిచేసి రాష్ట్రఫలాలను దక్కించుకునేందుకు కృషిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

### - అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు





వాసవిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర, అక్టోబరు 13 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వ హించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈపవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్ని ధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా, లలితా సహస్ర నామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## అలంపూర్ అభ్యర్థి మార్పు కోసం కేటీఆర్‌ను కలిసేందుకు వెళ్లిన నాయకులు..



ప్రగతి భవన్‌కు తరలివెళ్తున్న అసమ్మతి వర్గ నాయకులు

**ఇటిక్యాల, అక్టోబర్13 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌పార్టీ తరుపున ప్రస్తుత ఎమ్మెల్యే అబ్రహం మార్పును వ్యతి రేకిస్తూ ఎమ్మెల్సీ చల్లావెంకట్రామిరెడ్డి అనుచరవర్గ శుక్రవారం ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అబ్రహంను వ్యతిరేకిస్తున్న అసమ్మతి వర్గనాయకులు నియోజకవర్గంలోని అన్నిమండలాల నుంచి శుక్రవారం ఉదయం బీచుపల్లికి చేరుకొని అక్కడ మీడియా సమావేశం ఏర్పాటు చేసి అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అసమ్మతివర్గం నేతలతో స్వయంగా మంత్రి కేటీఆర్ కలిసేందుకు మధ్యాహ్నం 2 గంటలకు సమయం ఇవ్వగా నియోజకవర్గం నుంచి బీచుపల్లికి చేరుకొని అక్కడి నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో ప్రగతి భవన్‌కు బయలుదేరి వెళ్లారు. ఖచ్చితంగా ప్రస్తుత ఎమెమ్మెల్యే అబ్రహం అభ్యర్థి మార్పు చేయాలని, ఆయన పార్టీ నాయకులకు సహకరించడం లేదని, ఒంటెద్దు పోకడ పోతున్నారని విమర్శించారు. అలంపూర్‌లో అభ్యర్థి మార్పు జరిగితేనే పార్టీ గెలుస్తుందని, అందుకే మంత్రికి ఫిర్యాదు చేసేందుకు తరలి వెళ్తున్నట్లు వారు వివరించారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో ఇటిక్యాల జెడ్పీటీసీ హన్మంత్‌రెడ్డి, ఎంపీపీ స్నేహ శ్రీధర్‌రెడ్డి, వడ్డెపల్లి మున్సిపల్ చైర్మన్ కరుణ సూరి, సింగిల్‌విండో చైర్మన్ రంగారెడ్డి, కిశోర్, రవి, ప్రకాష్, నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అసమ్మతి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

## మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం



**కల్వకుర్తిరూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన కొత్త పుల్లయ్య ఆరోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతుడు కుటుంబ పరిస్థితిని దారమోని గణేష్ తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఉప్పలచారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ ఉప్పల వెంకటేష్‌కు వివరించారు. మృతుడి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ సమకూర్చిన ఆర్థికసహాయాన్ని దారమోని గణేష్ శుక్రవారం కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరుశరాములు, కాంపల్లి రవి, పాలెపు రాజేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి అండగా ఉంటాం...



**వెల్దండ, అక్టోబర్13 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన కొయ్యల ఎల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి శుక్రవారం పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సహాయంతో పాటు క్వింటాల్ బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, క్యాసారపు వెంకటయ్య, చలిచీమల నిరంజన్, మంగళిరి శ్రీనివాస్, గుద్దటి ప్రభాకర్, వెంకటేష్, మట్ట రఘుతో పాటు తదితరులు ఉన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం..

### - కుప్పగండ్ల విజయడైరీ చైర్మన్ శ్రీనునాయక్



**వెల్దండ, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన వారు కృంగి పోకుండా మరింత తర్ఫీదు పొంది క్రీడల్లో రాణించాలన్నారు. మండల పరిధిలోని కేస్లీ తాండలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో కుప్పగండ్ల విజయ డైరీ చైర్మన్ శ్రీనునాయక్ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరుస్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు ఆడుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

## అయుష్మాన్ భారత్ డిజిటల్ ఐడీ కార్డుల నమోదులో అలసత్వం ప్రదర్శించవద్దు...

### - జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.సుధాకర్‌లాల్




**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** పల్లె దవాఖాన వైద్యులకు(ఎం.ఎల్.హెచ్.పీ) నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.సుధాకర్‌లాల్‌హాజరై మాట్లాడారు. పల్లె దవాఖాన పరిధిలోని అయుష్మాన్ భారత్ డిజిటల్ ఐడీ కార్డుల నమోదులో మరింత వేగవంతం చేయాలని, ప్రతి పౌరుడికి డిజిటల్ ఐడి క్రియేట్ చేయాలని, వైద్య సేవల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, అన్ని రకాల వైద్య సేవలు డిజిటల్ రూపంలో నమోదు అవ్వడం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు పౌరులకు అందించడం జరుగుతుందన్నారు. పల్లె దవాఖానా పరిధిలోని గర్భిణీల సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేసీఆర్ కిట్‌లో నమోదు చేయాలని, మరియు దీర్ఘకాలిక రోగులకు అందించే సేవలను ఎప్పటికప్పుడు ఎన్.సి.డి.వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, విధుల నిర్వహణలో ఏ విధమైన అలసత్వం ప్రదర్శిం చిన శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్, ప్రోగ్రామ్ అధికా రులు డాక్టర్ ప్రదీప్, రెనాయ్య, శివ, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ ప్రవళిక, సీహెచ్ఓ అశోక్ ప్రసాద్, సందీప్, వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డిబిఎఫ్ నాయకులు

## ఎన్నికల కోడ్ పేరుతో దళితబంధును అడ్డుకోవడం సరికాదు

**మిరుదొడ్డి, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** ఎన్నికల కోడ్ పేరుతో దళిత బంధును అడ్డుకోవడం సరికాదని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రెండేళ్లుగా అమలవుతున్న దళితబంధు పథకాన్ని ఎన్నికల కోడ్ పేరుతలో దుబ్బాక నియోజక వర్గంలో ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పక్క నియోజకవర్గాలలో దళితబంధు అమలవుతుంటే దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం ఇక్కడ ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం తగదన్నారు. రెండో విడత దళితబంధు పథకం అమలు చేయడంలో దుబ్బాక నియోజకవర్గం వెనకబడి ఉందన్నారు. దళితబంధు అమలు చేకపోతే అందోళనలు చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమ తమ మేనిఫెస్టోలో దళిత బంధు పథకానికి ఇస్తున్న రూ.10 లక్షలను రూ.25 లక్షలకు పెంచుతూ హామీ ఇవ్వాలన్నారు. సమావేశంలో కేరింగ్ సిటిజన్ కలెక్టివ్ జిల్లా కో-ఆర్డినేటర్ సుకూరు ప్రవీణ్, డిబిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బ్యాగరి వేణు, దళిత నాయకులు బాలనర్సు, పాకనాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా మారుతున్న హుస్నాబాద్ రాజకీయం

**కోహెడ, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** హుస్నాబాద్‌లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఇప్పటికే బిఆర్ఎస్‌నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు టికెట్ కేటాయించగా, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డిలు టికెట్‌ను అశిస్తున్నారు. బిజెపి నుంచి ముగ్గురు నేతలు టికెట్ తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. కాగా బిఎస్‌పి సైతం హుస్నాబాద్‌లో పాగా వేయాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా బలమైన నేత కోసం అన్వేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది. హుస్నాబాద్‌లో బహుజన రాజ్యస్థాపనే లక్ష్యంగా బహుజన సమాజ్‌వాది పార్టీ ముందుకు సాగుతున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో మంచి పేరున్న బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన ఉల్లెంగుల ఏకానందంను హుస్నాబాద్ నుంచి బరిలోకి దించాలని యోచిస్తున్నట్లు సమాచారం. బిఎస్‌పి నుంచి ఏకానందం బరిలోకి దిగడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం, కాంగ్రెస్, బిజెపి పార్టీ అధిష్టానాలు అశావహుల్లో ఎవరిని కరుణిస్తారో వేచి చూద్దాం మరి.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** సమాజంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కెజెఆర్ గార్డెన్‌లో గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మ)ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చిన్నారులను సమాజంలో మొదటి అడుగు వేయించేవారు ఉపాధ్యాయులేనన్నారు. అనంతరం ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, నియోజకవర్గ అధ్యక్షుడు కాయిత నారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రస్మ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రయంలో ఎఎమ్‌సి చైర్మెన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, ట్రస్మ నియోజకవర్గ నాయకులు, హుస్నాబాద్ టౌన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కాయిత నారాయణరెడ్డి, ఆదిరెడ్డి, సమ్మిరెడ్డి, బుర్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అపోలో కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుక



బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు

**హుస్నాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** పట్టణంలోని అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ముందస్తు బతుమ్మ వేడుకలను ప్రిన్సిపాల్ వేముల గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగు, రంగుల పూలతో బతుకమ్మను పేర్చి సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మ ఆటలు ఆడి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మమత, లింగాల ప్రవీణ్, రాజేంద్రప్రసాద్, అఖిల, అధ్యాపకేతరులు గుగులోతు శేఖర్, అరుణ పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...**





ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బతుకమ్మ వేడకల దృశ్యం

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు బతుకమ్మ వేడుకల వల్లే ప్రపంచమంతా విస్తరించాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షపతి అన్నారు. శుక్రవారం కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి సాంప్రదాయ దుస్తూలతో పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరు,వైస్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి,అధ్యాపకబృధం కోమల, రాజయ్య,రేణుక, పద్మ, సుమలత, జ్యోష్ణ, రాజ్యలక్ష్మి, రమేష్, శ్రీనివాస్, సదానందం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన సలేంద్రి యువకులు

**చిన్నకోడూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మెట్టుపల్లి మదిర సలేంద్రి గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు పిట్ట పర్శరాములు ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బిఆర్ఎస్ పార్టీకి చెందిన 50 మంది యువకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కాషాయ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, పార్టీలో చేరిన వారు వేణు, వెంకటేష్, నాగరాజు,ప్రశాంత్, అనిల్,హరికృష్ణ, రాకేష్, నాగరాజు, రాజు, గణేష్, చందు,అరవింద్,అకాష్, సంతోష్, అనంద్, శివాజీ, కార్తిక్, శ్రీను, వినీత్, రమేష్, రెడ్డి మహేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రమేష్, విష్ణుమూర్తి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి తీర్థం పుచ్చుకుంటున్న యువకులు

# 16 నుంచి పోస్టల్ శాఖ పొదుపు పథకాల స్పెషల్ డ్రైవ్

### ఏఎస్పీ సంపత్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పొదుపుపథకాల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ సంపత్‌రెడ్డి తెలిపారు. నేషనల్ పోస్టల్ వీక్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా పెద్దశంకరంపేటలో శుక్రవారం మేళా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 9 నుండి ఈ రోజు వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నేషనల్ పోస్టల్ వీక్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఇండియా పోస్టపేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్, గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీల ప్రత్యే మేళాలు శుక్రవారం పలుగ్రామాల్లో నిర్వహించినట్లు వివరించారు.అలాగే ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్ లక్ష్యాలలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 21 వరకు అకౌంట్స్ ఓపెనింగ్, పాలసీల సేకరణ స్పెషల్ డ్రైవ్ సంగారెడ్డి డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ సంపత్‌రెడ్డి

ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరుక కావాలనే ఉద్దేశంతో ఇంటింటికీ పోస్టల్ పథకాలు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఏఎస్పీ కోరారు. పుట్టిన పసికందు నుండి వంద సంవత్సరాలు వయస్సు గల వారందరికీ వివిధ పోస్టల్ పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ పొదుపు పథకాల స్కీమ్‌లకు అత్యధిక వడ్డీ ఇస్తున్న ఏకైక సంస్థ పోస్టల్‌శాఖ అని పేర్కొన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్, గ్రూప్ యాక్సిడెంట్ భీమా పాలసీలు కేవలం వార్షిక ప్రీమియం రూ. 399, రూ.396తో 20 లక్షల ఇన్సూరెన్స్ వరకు అందిస్తున్న పాలసీలు ఉన్నాయని వివరించారు. స్పెషల్ డ్రైవ్‌ను గ్రామీణ తపాలా ఉద్యోగులు అందరూ ఇంటింటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని ఏఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాస్, సబ్ పోస్ట్ మాస్టర్ రఘు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మాణయ్య, విజయ్, కృష్ణవేణి, గంగారం, నెహ్రు, ప్రశాంత్, ఏబీపీఎంలు తుకారాం, బీరప్ప, సవిత, నిరంజన్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్

## ముమ్మరంగా సాగుతున్న ప్రజా ఆశీర్వద సభ ఏర్పాట్లు

**హుస్నాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** ఈనెల 15న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజాశీర్వార సభ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారానికే హెలీప్యాడ్ నిర్మాణం పూర్తయ్యాయి. సభాస్థలి వేదిక పనులను ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గం సిఎం కేసీఆర్‌కు లక్ష్మి నియోజకవర్గం అని గతంలో 2014, 2018లోనూ జరిగిన అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని ఈ ప్రాంతం నుండే పూరించి విజయం సాదించారని,అదే నమ్మకంతో మూడోసారి హ్యాట్రిక్ దిశగా ముందుకు సాగేందుకు ఇక్కడి నుండే ఎన్నికల శంకారావాన్ని పూరించనున్నట్లు తెలిపారు.ఈ భహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మహిళలు,వికలాంగులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశామని సభలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.ఈ సభకు నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున తరలి రావాలి

**హుస్నాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త :** ఈనెల 15న హైదరాబాద్‌లోని కాచాగూడ మున్నూరు కాపు భవన్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్య క్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న బిసి రాష్ట్ర మహాసభకు హుస్నాబాద్ ప్రాంతం నుండి బిసిలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయ వంతం చేయాలని సంఘం నియోజకవర్గ కన్వినర్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ పిలుపునిచ్చారు.

## మృతుని కుటుంబానికి ఎంపిపి ఆర్థిక సహాయం

మర్కుక్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త): మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిన మాధారి అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి పాండుగౌడ్ శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు నాయకులు చెక్కలి రాములు, బోయిని మల్లేశం, మేకల శ్రీనివాస్, బోయిని లక్ష్మణ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి



బిఆర్ఎస్ పార్టీ నాయకులతో మామిడి మోహన్‌రెడ్డి

**రాయపోల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** దుబ్బాక బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ సీనియర్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల పరిధిలోని పెద్ద అరేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ,జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి,రైతుబంధు మండల అధ్యక్షులు మున్నా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ ,రాజిరెడ్డి, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం

### డిసిసి ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్



మాట్లాడుతున్న మీసం నాగరాజు యాదవ్

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ, సబ్బండ వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. అధికార బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రతిపక్ష నాయకులను బెదిరింపులకు గురి చేస్తూ కేసులు పెట్టిస్తున్నారని అరోపించారు. సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు చేసిందేమిలేదన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందడం లేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మీసం మహేందర్, జయంత్, కనకయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో రైతు క్షేత్ర ప్రదర్శన

**గజ్వేల్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలో రైతు దేవన్నగారి ప్రభాకర్ పొలంలో జననీ సీడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 300 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. రైతు పత్తి చేనును తిలకించి జైకిసాన్ బిజి పత్తి రకం కాయలు లావుగా ఉండి దగ్గర దగ్గరగా ఉండి చెట్టుకు 60 నుండి 70 కాయలు కాస్తున్నాయని రైతులకు వివరించారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా జననీ సీడ్స్ కంపెనీ యాజమాన్యం జోనల్ మేనేజర్ పూల శివ కోటేశ్వర రావు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు జైకిసాన్ ద్వారా అధికబరువు కాయలు కలిగి ఉండి అన్ని రకాల నేలల్లో సాగుకు అనుకూలమని తెలిపారు. దృడమైన కాండం కలిగి మొక్క చివరి వరకు ఒరగకుండా తెగుళ్ళను సమర్థవంతంగా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డిస్ట్రిబ్యూటర్ వెంకటేశ్వర రైతు సేవా కేంద్రం నిర్వాహకులు గోలి సంతోష్‌కుమార్, కంపెనీ ఆర్ఎం వాస శంకర్‌రావు, ఏరియా మేనేజర్ నీరుడి కనకయ్య, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



బిజెపిలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

## బిజెపిలో పలువురు చేరిక

**రాయపోల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** రాయపోల్ మండలం రామారం, కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిజెపిలో చేరారు. శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే మాదవనేని రఘునందన్‌రావు సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు వారికి బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిజెపిలో చేరిన వారిలో కొత్తపల్లి వార్డు మెంబర్ చాకలి కనకవ్వబిక్షపతితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు అదే విధంగా రామారం గ్రామానికి చెందిన బక్కొళ్ల నరసయ్య, మాజీ వార్డు మెంబర్ ఎల్లయ్య, కో ఆప్షన్ సభ్యులు కిష్టవ్వ కిషన్, ఉసిగారి స్వామి,మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు మంద లక్ష్మణ్, రెడ్డి సంఘం సభ్యులు కిషన్‌రెడ్డి, నాయకులు చాకలి యాదగిరి, బిచ్చంగారి ఎల్లం, చాకలి స్వామి, రెడ్డబోయిన వెంకటేష్, చెరుకు రాజిరెడ్డి, హనుమంతు, సత్తయ్య, యాదయ్య, పరుశురాములు, సంజీవ్, స్వామి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ రాజిరెడ్డి,జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మంకిడి స్వామి, మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు,బిజెపి మండల నాయకులు మన్నె ఆంజనేయులు,సత్యపాల్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ రెడ్డబోయిన గోపాల్, చంద్రం, చంద్రారెడ్డి, రామారావు, బూత్ అధ్యక్షులు కమ్మరి మహేష్, నరేష్‌గౌడ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో చెరుకు శ్రీనావాస్‌రెడ్డి

**రాయపోల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం రాయపోల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మంతూర్ గ్రామ వార్డు మెంబర్లు వీరమైన యాదగిరి,పట్నం యాదగిరి, పాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిన్న ఎల్లయ్య, మందారం మల్లేశం, గొర్రె మహేందర్‌రెడ్డి, చల్ల పెంటయ్య, బంగారం నర్సింలు, తొడంగల్ల శివకుమార్ పడిగే నర్సింలు, మన్నె కరుణాకర్, దండు బిక్షపతితో 50 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..దుబ్బాక కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పేట సుధాకర్ మండల ఉపాధ్యక్షులు దయాకర్‌రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, ఇప్ప మల్లేశం, కిష్టారెడ్డి, రాజిరెడ్డి, దయాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో కార్యోన్ముఖ ఉపన్యాసం



మాట్లాడుతున్న కల్నల్ సునీల్ అబ్రహం

**గజ్వేల్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో ప్రారంభమైన ప్రత్యేక జాతీయ శిబిరానికి వివిధ రాష్ట్రాల నుండి హాజరైన కాడెట్లకు క్యాంప్ కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం కార్యోన్ముఖ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసి అనేది ప్రపంచంలోనే యూనిఫాం గల అతిపెద్ద ఆర్గనైజేషన్‌గా ఉందని, క్రమశిక్షణ, దేశభక్తి అనేవి ఎన్‌సిసి కేడెట్ల ప్రాథమిక లక్షణాలు అని గుర్తు చేశారు. 12 రోజుల శిక్షణలో భాగంగా తెలంగాణలోని అన్ని పర్యాటక కేంద్రాల సందర్శన ఉంటుందన్నారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కాడేట్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వైరల్ ఫీవర్ పట్ల అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తల గురించి తెలియజేశారు. శిబిరంలో నిర్వహించబోయే కార్యక్రమాలలో క్రీడ, సాంస్కృతిక పోటీలకు టీమ్‌ల ఎంపికను డ్రా పద్ధతి ద్వారా ఎన్‌సిసి ఆఫీసర్ల సమక్షంలో నిర్వహించారు. రాష్ట్రంలోనే మోడల్‌గా సకల సదుపాయాలుగల గజ్వేల్ బాలురహాబ్‌లభించినందుకు క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కల్నల్ పీఎస్ నందా ఎన్‌సిసి తరపున ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మొత్తం 300 ఎన్‌సిసి కాడేట్లు, 15 మంది ఎన్‌సిసి ఆఫీసర్లు, 10 పిఐ స్టాఫ్ హాజరైనట్లు లెఫ్టినెంట్ ఆఫీసర్ డాక్టర్ భవాని, డాక్టర్ మనోజ్‌లు తెలిపారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, కించపరిచే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు : ఎస్ఐ మహమ్మద్ గౌస్

**కొల్చారం, అక్టోబర్13 ప్రభాతవార్త:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ సోషల్ మీడియాలో వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ గ్రూపులలో గానీ, ఇతర వ్యక్తులు గానీ పార్టీలను రెచ్చగొట్టేవిధంగా, కించపరిచే విధంగా, అవమానపరిచే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. కొల్చారంలోని పోలీస్ ఠాణాలో ఆయన మాట్లాడుతూ గ్రూప్ అడ్మిన్‌లు అందరూ మీ మీ గ్రూపుల్లోని సభ్యుల గురించి తెలుసుకొని పై విధమైన చర్యలకు ఎవరైనా పాల్పడే అవకాశం ఉంటే అలాంటి వారిని గ్రూప్ నుంచి తొలగించాలని, లేనియెడల వాళ్ల చేసే చర్యలకు అడ్మిన్ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.




శౌర్య జాగరణ యాత్ర నిర్వహిస్తున్న విహెచ్‌పి నేతలు

## విహెచ్‌పి ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర

**వెల్దుర్తి, అక్టోబర్13 ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వెల్దుర్తిలో శుక్రవారం హనుమాన్ ఆలయం నుండి పురవీధుల గుండా శౌర్య జాగరణ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన మంత్రి సుత్తి మల్లేశం మాట్లాడుతూ వీహెచ్‌పీ ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విశ్వహిందూ పరిషత్ గ్రామ కమిటీలను పెంచాలని, యువకులను అధిక సంఖ్యలో ధర్మం పట్ల నిష్టగల వ్యక్తులుగా తయారు చేయాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్ చేపట్టిన అనేక ఉద్యమాలను విజయవంతం చేయండంలో హిందూ యువత పాత్ర ముఖ్యమైందన్నారు. నేటి యువతకు మన సంస్కృతి సంప్రదాయాల పట్ల శ్రద్ధను తెలియజేస్తూ పనిచేయాలని ఆయన తెలిపారు. అనంతరం వెల్దుర్తి మండల విశ్వహిందూ పరిషత్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చంద్రకాంత్, సభ్యులుగా టైలర్ పోచయ్య, శేఖర్‌గౌడ్, దినేష్, నవీన్, గణేష్, మహేందర్‌గౌడ్, రమేష్, శ్రీధర్‌లను ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కార్యదర్శి ప్రభాకర్, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మూసాయిపేటకు 45 ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లను అందజేత

**వెల్దుర్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** రానున్న బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని మాసాయిపేట మండలంలోని రాశి సీడ్స్ కంపెనీ వారు స్టేషన్ మాసాయిపేట గ్రామానికి 45 ఎల్ఈడీ స్ట్రీల్ లైట్లను అందజేయడం జరిగిందని స్థానిక సర్పంచి నర్సింలు తెలిపారు. శుక్రవారం గ్రామ పరిధిలోగల రాశి సీడ్స్ కంపెనీవారు పండుగల పూట విద్యుత్ కాంతులు ఉండాలనే ఉద్దేశంతో సర్పంచి నర్సింలు, ఎంపీటీసీ నవనీత శ్రీనివాస్‌లకు ఎల్ఈడీ స్ట్రీల్ లైట్లను రాశి సీడ్స్ యాజమాన్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు రాశీ సీడ్స్ కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ఆస్మా సుల్తానా, వార్డు సభ్యులు జాఫర్, నగేష్, రాములు, నర్సింగారావు, నిఖిత, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, హెరిటేజ్ క్లబ్ అధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలో పూల పండుగైన బతుకమ్మ పండుగ కళాశాలలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మహిళా సాధికారిత విభాగాధిపతి సుజాత, హెరిటేజ్ క్లబ్ విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జబర్దస్త్ అర్టిస్ట్ విశ్వప్రార్థిని, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు గోపాల సుదర్శనం, మధుసూదన్, అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు, మహేందర్‌రెడ్డి, రాణికొమ్మిడి, కొండల్‌రెడ్డి, హరిబాబు, బిక్షపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ యాదవరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత



ఎమ్మెల్సీ యాదవరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** వర్గల్ శ్రీవిద్యాధరి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, గజ్వేల్ ఏసిపి రమేష్ తదితరులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈనెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు శరన్నవరాత్ర మహోత్సవాలు జరుగనుండగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా మూలా నక్షత్రం సందర్భంగా ఈనెల 20వ తేదీన క్షేత్రానికి భక్తులు పోటెత్తే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న : మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో స్థానిక ఆర్యవైశ్య నాయకుడు అత్తెల్లి కిషన్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో 400 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేస్తే పుణ్యం లభిస్తుందన్నారు. అమావాస్య ముందు రోజులు పితృపక్షం రోజుల్లో అన్నదానం నిర్వహిస్తే పూర్వీకుల ఆత్మ శాంతిస్తుందని పురాణాలు చెబుతున్నాయన్నారు. అత్తెల్లి కిషన్, శ్రీనివాస్‌లు వారి తండ్రి శంకరయ్య జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, సిద్ధి బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, అత్తెల్లి లక్ష్మయ్య, కొమురవెళ్ళి శంకరయ్య, అయిత సత్యనారాయణ, తోట బిక్షపతి, శివకుమార్, జూలూరి నర్సింలు,జూలకంటి ప్రభాకర్, దోమకొండ సురేందర్, సతీష్, కల్లూరి సత్యనారాయణ, ఉమేష్, వెంకటేష్, దూబకుంట లచ్చల్, సిద్దేశ్వర్, కైలాస ప్రశాంత్, గండె సంతోష్ పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా ఉంటా

### -రైతుబంధు మండల కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

**మర్కుక్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** మండలంలో ఎలాంటి ఆపద వచ్చిన పేద కుటుంబాలకు అండగా ఉంటానని రైతుబంధు మండల కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మర్కుక్‌లో కుమ్మరి రాజు రెండు రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఆయనతో పాటు ఎంపిటిసి చైతన్య శంకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాల్‌నర్సయ్యగౌడ్, అనిల్‌కుమార్, బాలకృష్ణాగౌడ్, నాయకులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిన మాధారి అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మండల బిసిసెల్ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేష్, చెక్కల నర్సింలు, నీల రాజు, నారని భూమయ్య ఉన్నారు.



కుర్తివాడలో బేడ బుడగజంగాల ఆలయ నిర్మాణానికి హామీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## కుర్తివాడలో ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ

**పాపన్నపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని కుర్తివాడ గ్రామంలో బేడ బుడగ జంగం ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి హామీ చేసినట్లు సంఘం కోశాధికారి నవీన్ తెలిపారు. కుర్తివాడ సర్పంచ్ స్రవంతి శ్రీనివాస్‌తో కలిసి బేడ బుడగ జంగం నాయకులు మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. గ్రామంలో ఆలయాన్ని నిర్మించా లని సంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తేగా ఆలయ నిర్మాణానికి, దళిత బంధు మంజూరుకు ఎమ్మెల్యే హామి చేశారన్నారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం ప్రతినిధులు టేకు ఏసు, టేకు లక్ష్మి, ఉబ్జి దాదామ్మ, చంద్రమ్మ, రేవల్లి వెంకటేశం, ఉబిది అంబవ్వ, ఏసు ఉప్పి కృష్ణ, రేవల్లి నరిసనలు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ఎస్‌పిగా రూపేష్ కుమార్

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** జిల్లా ఎస్‌పిగా చెన్నూరి రూపేష్ కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఎస్పీగా సేవలందించిన యం రమణకుమార్ బదిలీపై వెళ్ళడంతో 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన రూపేష్ కుమార్ హైదరాబాద్ డీసీపీగా విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు రూపేష్‌కుమార్‌ను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయడంతో శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన రూపేష్‌కుమార్‌ను పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## టిడిపి అధ్యక్ష పదవికి షాహీద్ పాషా రాజీనామా

**పాపన్నపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఉన్న ఎండి షాహీద్ పాషా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో షాహీద్ పాషా మాట్లాడుతూ మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి రోహితరావు గెలుపు కొరకు కృషి చేస్తా నన్నారు. 1985 నుంచి టిడిపికి సేవలు అందిస్తూ వచ్చానని, ఒ మారు రామతీర్థం గ్రామ సర్పంచ్‌గా, ఉప సర్పంచ్‌గా,మెదక్ మార్కెట్ కమిటి డైరెక్టరుగా, టిడిపి ప్రధాన కార్యదర్శిగా ప్రజలకు, పార్టీకి సేవలందించినట్లు గుర్తు చేశారు. మెదక్ నియోజకవర్గ ప్రజలకు మైనంపల్లి హన్మంతరావు చేసిన సేవలు ఎనలేనివగా ఉన్నాయని కొనియాడారు. టిడిపికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి మైనంపల్లి రోహిత్‌రావుకు మద్దతు ప్రకటించి ప్రచారం చేసి భారీ మెజార్టీలో శాసన సభ తలుపులు తట్టేలా కృషి సల్పుతామన్నారు.

## కేతకి ఆలయాన్ని దర్శించుకున్న ఢిల్లీ వసంత్

**ఝరాసంగం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువుండి నిత్యపూజలందుకుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వరుడి ఆలయాన్ని శుక్రవారం భారతీయ జనతా పార్టీ నేత ఢిల్లీ వసంత్ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఢిల్లీ వసంత్‌ను ఆలయ మర్యాదలతో అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఢిల్లీ వసంత్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి జహీరాబాద్ అసెంబ్లి ఎన్నికల ఇంచార్జి మల్లికార్జున్ పాటిల్, మండల అధ్యక్షులు అడివన్న, బిజేవైఎం మండల అధ్యక్షులు విశ్వనాథ్, నాయకులు శ్రీనివాస్ పాటిల్, సంగమేష్ పాటిల్ అశోక్, యాదవరెడ్డి, సంతోష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి,కూతురుకి గాయాలు

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ద్విచక్రవాహనం-అంబులెన్స్ ఢీ కొనడంతో తండ్రి కూతురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి అంబాజీపేట శివారు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.... కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట మండలం మాల్తుమ్మెదకు చెందిన యాదయ్య తన కూతురు నందిని గజ్వేల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటుంది. దసరా సెలవులు రావడంతో కూతురిని తీసుకొని యాదయ్య తన కూతురిని తిసుకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంబాజీపేట శివారు వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని మెదక్ నుండి చేగుంట వైపునకు వెళ్తున్న అంబులెన్స్ బలంగా ఢీ కోట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** మనస్థాపంతో యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి సంగాయపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం... శాలిపేట గ్రామానికి చెందిన సంపత్(20), కూలిపనులు చేసుకుంటూ నానమ్మ దుర్గమ్మ వద్ద ఉంటున్నాడు. తండ్రి నర్సింలు ఇరవై సంవత్సరాల క్రితం మృతి చెందగా, కుమారుడిని తల్లి లక్ష్మీ వదిలి వెళ్లిపోయింది. నానమ్మ దుర్గమ్మ సంపత్‌ను పెంచుకుంటూ సంగాయపల్లిలో నివసిస్తుంది. గత కొద్ది రోజుల క్రితం కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో గ్రామంలో ఇంటి కోసం కొంత స్థలాన్ని కొన్నాడు. ఇల్లు నిర్మాణానికి డబ్బులు లేకపోవడంతో మనస్థాపానికి గురైన సంపత్ అంబాజీపేటలో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సవాల్ స్వీకరించిన జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్

**నిజాంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త :** నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఆదివారం పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవకతవకలు జరుగలేదని నిజమైన అర్హులకే డబుల్ ఇళ్లను పంపిణీ చేశామని సవాల్ విసిరిన బీఆర్ఎస్ నాయకుల సవాల్‌ను స్వీకరించి బిజెపి నాయకుడు, నిజాంపేట జడ్పీటీసీన పంజా విజయ్‌కుమార్ శుక్రవారం డబుల్ ఇళ్ల దగ్గరకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ ఇళ్లలో పనులు పూర్తి కాకుండానే పంపిణీ చేశారన్నారు. కనీస సౌకర్యాలు లేవని వాటిని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, రమేష్, బాజా అంజయ్య పాల్గొన్నారు.

## నర్సాపూర్ గడ్డమీద కాషాయం జెండా ఎగువేస్తాం

**బిజెపి ఓబిసి జిల్లా అధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్**

**నర్సాపూర్, అక్టోబర్ 13.ప్రభాతవార్త:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ గడ్డమీద కాషాయం జెండాను ఎగుర వేస్తామని బిజెపి నర్సాపూర్ మండల ఇంచార్జీ ఓబిసి జిల్లా అధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ప్రవాస్ యోజన సంస్థాగత విషయంలో బాగంగా ఇబ్రాహీం బాద్ గ్రామ పరిధిలోని ఎల్లారెడ్డి గుడా తండాలో శక్తి కేంద్రంలో శక్తి కేంద్రం ఇంచార్జుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి నర్సాపూర్ మండల ఇంచార్జీ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజన తండాల్లో శక్తి కేంద్రం ఇంచార్జుల అధ్వర్యంలో బిజెపి పార్టీని భలోపేతం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినందున ప్రతిఒక్కశక్తి కేంద్రం ఇంచార్జులు బాధ్యతగా తీసుకొని బిజెపి పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రదాన కార్యదర్శి నీలి నాగేశ్, బిజెవైఎం మండల అధ్యక్షులు పోతురాజు అనిల్, ప్రధాన కార్యదర్శి గానుగ అనిల్, కార్యదర్శులు రాజెశ్, వేణుగౌడ్,ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శులు నరెందర్, దాసు, భూత్ అధ్యక్షులు సాయినాథ్,నాయకులు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రచారకర్తగా రణవీర్‌సింగ్

కంటి ఆరోగ్యంలో గ్లోబల్ లీడర్ జాన్సన్ అండ్‌జాన్సన్ మెడిటెక్‌లో భాగమైన జాన్సన్ అండ్ జాన్సన్ విజన్ జెన్‌జెడ్ మిలీనియల్స్‌ను కాంటాక్ట్ లెన్స్‌లను ప్రయత్నించమని ప్రోత్సహించడానికి సూపర్‌స్టార్ రణవీర్ సింగ్‌తో చేతులు కలిపినట్లు వెల్లడించింది.



జాడిమల్కాపూర్ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

## కల్వకుంట్ల కుటుంబ పాలనను ఖతం చేయండి

**నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి చంద్రశేఖర్**

**జహీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రానున్న శాసన సభ ఎన్నికల్లో కల్వకుంట్ల కుటుంబ పాలనను ఖతం చేయాల్సిన అవసరం ప్రతి ఓటరుపై ఉందని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య సమన్వయకర్త డాక్టర్ ఏ చంద్రశేఖర్ అన్నారు. వస్తున్నా... మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్, జంగర్ బౌలి తండా, హరిచంద్ నాయక్ తండా, విఠ్టనాయక్ తండా గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆయా గ్రామాల్లో మహిళలు హారుతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సబ్బండ వర్గాల పోరాటాలతో, ఎందరో యువకుల త్యాగాల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీ అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ సొమ్మును కక్కించి పేదలకు పంచుతామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కేసిఆర్ మాయమాటలను నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరన్నారు. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులను మాజీ మంత్రి చంద్రశేఖర్ పార్టీ ఖండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

## ఎన్ఎంఆర్ యువసేనలో చేరిన కాలనీ వాసులు

**-సాదరంగా ఆహ్వానించిన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు**



ఎన్ఎంఆర్ యువసేన చేరిన కాలనీ వాసులు

**రామచంద్రాపురం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రానున్న శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్న నీలం మధు ముదిరాజ్‌కు బహుజన సబ్బండ వర్గాల మద్దతు రోజు రోజుకు పెరుగుతోంది. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన 200 మంది కాలనీ వాసులు శుక్రవారం నీలం మధు సమక్షంలో ఏఏ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ ఖదీర్ ఆధ్వర్యంలో రాయల్ మదీనా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఎన్ఎంఆర్‌లో చేరి నీలం మధుకు జై కొట్టారు. నీలం మధును ఎమ్మెల్యేగా శాసన సభ తలుపులు తేట్టేలా ఎన్నికల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు న్యాయం చేసేందుకే రాజకీయంలోకి వచ్చినటుల పేర్కొన్నారు. తన విజయానికి సహకరిస్తునన ఏకే ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ ఖదీర్ సేవలను నీలం మధు కొనియాడారు. కార్యక్రమంలో ఖలీల్‌పాషా, అబ్దుల్ నిసార్, ఇనాయత్, అంజద్, అమిత్, ఇలియాస్, ఫాతిమా బేగం, సత్యవతి, కిషోర్, సాయి కిరణ్, గణేష్, శివ, సాయి కృష్ణ, మహేష్, రవ, కృష్ణ, చింటు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**-స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటుచేయాలి**

**-జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**



ఐఓసి కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**గజ్వేల్, అక్టోబర్ 13 (ప్రభాతవార్త):** శాసనసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంకు సంబంధించి ఐఓసి కార్యాలయంలో ఏ-బ్లాక్ నందు ఎన్నికల ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో శాసనసభ ఎన్నికల సందర్భంగా ఐఓసి కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లో గట్టి బందోబసునత చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కిటికీలను పూర్తిగా ఇటుకలతో మూసివేయాలని, స్ట్రాంగ్ రూమ్ ముందు చుట్టూ సిసి కెమెరాలను మార్చాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ పక్కనే విద్యుత్ మాపక గది ఉన్నందున ఫైరింగ్ సంబంధించి ఏమైనా సమస్యలు తలెత్తితే వెనువెంటనే పరిష్కరించడానికి ఫైర్ వాహనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. తపాలా కార్యాలయంలో గజ్వేల్ నియోజకవర్గ నూతన ఓటర్లకు సంబంధించి ఓటర్ ఐడి కార్డులు వచ్చాయని తపాలా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్డులు వచ్చిన వెంటనే గ్రామాలకు వెళ్ళి పంపిణీ చేయాలని సూచించారు. ఆర్అండ్‌బి గదిని స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం గజ్వేల్ పట్టణ శివారులో ఉన్న ఆర్అం డ్ఆర్ కాలనీలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేయబడిన పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్, ఏసిపి రమేష్, తహసీల్దార్ బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

## టీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు గౌరవమే లేదా?

**పార్టీకి దూరమవుతున్న ఉద్యమకారులు**

**అల్లాదుర్గం, అక్టోబరు 13, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో గణనీయమైంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ఐబీ చౌరస్తా డాగ్‌బంగ్లా వద్ద తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు శుక్రవారం నాడు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మోహన్ రాథోడ్, గోపాల్ నాయక్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రం ఏర్పడేంత వరకు ఉద్యమాన్ని ఉదృతం చేశాం. అక్రమ కేసులను సైతం లెక్కచేయకుండా, లాఠీ దెబ్బలకు తట్టుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ పార్టీ అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకొని అందోల్ గడ్డపై గులాబీ జండాను రెపరెపలాడించాము. అలాంటి ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ గుర్తించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమకారులు మోహన్ రాథోడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విస్లావత్ గోపాల్, ఉద్యమకారులు మహ్మద్ రియాజ్, వద్యా కిరణ్, గోమ్య నాయక్, గణ్యనాయక్, మాచెందర్, దుర్గయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశం



బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

## శాంతినికేతన్‌లో బతుకమ్మ సంబరాలు

**సదాశివపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఆనందోత్సవాల మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ పిల్లోడి జయమ్మ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరై గౌరమ్మ పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. రంగు రంగు పూలు, కాగితాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మల చుట్టూ విద్యార్థులు ప్రదక్షిణలు చేస్తూ ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలను చూడముచ్చటగా జరుపుకున్నారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండగ అన్నారు. బతుకమ్మలను అందంగా పేర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. మొదటి బహుమతిని వర్షిత, రెండవ బహుమతిని బలరాం ప్రణీత, బలరాం స్వాతి, మూడవ బహుమతిని దీక్షిత గౌడ్, మౌనికలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాలిపటేల్ ప్రభు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరవింద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సవాళ్లకు ఎదుర్కోనే ధైర్యం కావాలి : బ్రజ్ కిషోర్



మాట్లాడుతున్న బ్రజ్ కిషోర్

**పటాన్‌చెరు, అక్టోబర్ 13,ప్రభాతవార్త:** జీవితంలో సవాళ్లను ఎదుర్కోనే ధైర్యం కావాలని, ఒడిదుడుకులను ఎదుర్కోంటు అపజయాలను అవకాశాలుగా మార్చుకోవడం విజయానికి దారి తీస్తుందని, జెయింట్ స్టెప్ వ్యవస్థాపకుడు చిఫ్ మెంటర్ బ్రజ్ కిషోర్ గుప్తా అన్నారు. శుక్రవారం హైదరబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్(జీఎస్ బిహెచ్‌లో)లో మిస్టెక్స్ టూ మిరాకిల్స్ అనే అంశంపై ఆయన అతిధి ఉపన్యాసం చేశారు. అతను ఎంబిఎ విద్యార్థులకు అనేక తెలివైన కథలు, మరియు ప్రేరణాత్మక విషయాలను చేబుతూ వారికి ప్రోత్సహించారు. అతను ప్రెరణాత్మక అంతర్దృష్టులను అందిస్తాడు. తప్పులను అద్భుతాలుగా మార్చడానికి నిజ జీవితా ఉదాహరణాలను చెబుతాడు. జీవితంలోని వాస్తవికతలను స్వీకరించి స్వీయ అభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు సూచించారు. స్టూడెంట్ ప్లేస్‌మెంట్ కమీటీ సభ్యురాలు నమ్రతా దేవి స్పందిస్తూ వనరుల పరిమితులను ఒకరు అనుసరించే అవకశాలను నిర్దేశించకూడదు. బ్రజ్ కిషోర్ ఆసక్తి కరమైన వ్యక్తి గత ఉదాహరణలు ఉంటకిస్తూ తప్పులను విజయానికి సోపాణాలు మార్చుకోవడం యోక్క ప్రాముఖ్య తను విద్యార్థి హెమంత్ అనర్గలంగా ప్రదర్శించడాన్ని అభినందించారు. మరో విద్యార్థి శరణ్య స్పందిస్తూ జీవితంలో చేసే తప్పుల నుంచి పాఠాలను నేర్చుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. గీతం బి స్కూల్ విద్యార్థుల కోసం తన విలువైన సమయాన్ని వెచ్చించినందుకు బ్రజ్ కిషోర్ గుప్తాకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## మున్నూర్ కాపులకు న్యాయం చేసే వారికే మద్దతు

**-మున్నూర్ కాపు సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి**



విలేఖరులతో మాట్లాడుతున్న నాయికోటి యాదగిరి

**రామచంద్రాపురం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మున్నూర్ కాపులను రాజకీయ పార్టీలు దశాబ్దాల కాలంగా ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకున్నాయని మున్నూర్ కాపు సంఘం జిల్లా అధ్యక్షులు నాయికోటి యాదగిరి విమర్శించారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోన అశోక్ నగర్ కాలనీలోని మున్నూర్ కాపు కార్యాలయంలో కాపు సంఘం వ్యవస్థాపకులు తిక్కరెడ్డి, విష్ణుమూర్తిల ఆధ్వర్యంలో మున్నూర్ కాపు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయికోటి యాదగిరి మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికల తరువాత వాటిని గాలికి వదిలేయడం సహజంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్నూర్ కాపులను రాజకీయంగా, సమాజికంగా ఎదగనీయకుండా పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మున్నూర్ కాపులకు ప్రధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. మున్నూర్ కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు అంశాలను రాజకీయ పార్టీలు తమ ఏజండాలో చేర్చాలన్నారు. జనాభాలో 25 శాతం ఉన్న తమకు అదే నిష్పత్తిలో శాసన సభ, పార్లమెంట్ స్థానాలను తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో కార్పోరేషన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 5000 వేల కోట్లను కేటాయించాలని, సదరు విషయాలను పార్టీలో తమ మెనిఫెస్టోలో పొందుపర్చాలని, మెనిఫెస్టోలో పేర్కొన్న పార్టీలకే మున్నూర్ కాపుల మద్దతు ఉంటుందన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం మున్నూర్ కాపుకు ప్రాదాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్, నాయకులు మోహన్, వెంకటేశ్వర్లు, రవణం ప్రసాద్, సూర్యచంద్రరావు, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్**

**సంగారెడ్డి బ్యూరో అక్టోబరు 13,ప్రభాతవార్త:** నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని,అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్‌ను, స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు.నామినేషన్ల ప్రక్రియ సాపిగా సాఫీగా జరిగేలా అవసరమైన ఆయా ఏర్పాట్లను చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి రవిందర్‌రెడ్డికి సూచించారు. పోలింగ్ సిబ్బందికి సామాగ్రి పంపిణి చేయడానికి అంబేద్కర్ స్టేడియంను, ఈవీఎంలు ,వివీ ప్యాట్‌లు భద్రపరచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశిలించి పలు సూచనలు చేశారు.

## విద్యార్థుల అభివృద్ధికి క్రీడలు దోహదం

**గిరిజన గురుకల, సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి నవీన్ నికోలస్**

**నర్సాపూర్, అక్టోబర్ 13.ప్రభాతవార్త:** విద్యార్థుల అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడ ఎంతో దోహదపడతాయని గిరిజన గురుకుల, సాంఘీక సంక్షేమ గురుకుల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ అన్నారు.శుక్రవారం నర్సాపూర్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల మైదానంలో 7 వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు మెదక్, కామారెడ్డి,నిజామాబాద్, అదిలాబాద్ ఆర్‌సి రీజియన్ గిరిజన గురుకుల, సాంఘీక సంక్షేమ గురుకుల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వళన చేసి ఈ క్రీడ పోటీలను ప్రారంబించారు.ఈ కార్యక్రమంలోఓఎస్‌డి రంగారెడ్డి, ఆర్‌సి సంపత్‌కుమార్, మండల విద్యాధికారి బుచ్యా నాయక్,ఇంచార్జీ ప్రిన్సిపాల్ కళ్యాణి, వివిద పాఠశాలల నుండి వచ్చిన ప్రధానాచార్యులు,పిఈటి, పిడి లుతో పాటు ఈ క్రీడా పోటీల్లో సుమారు 566 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్‌సి రీజియన్ కార్యదర్శి నవీన్ నికోలస్ మాట్లాడుతూ నర్సాపూర్‌లో ఈ జోనల్ స్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడ ప్రముఖ పాత్ర వహిస్తాయని అన్నారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇంచార్జీ పిడి,సుజాత,వైస్ ప్రిన్సిపాల్ చార్లెస్, సీనియర్ లెక్చరర్ సిహెచ్ .వెంకటయ్య,కె.సుధీంద్ర, శ్రీనివాస్,గ్రంథాలయ నిర్వహణ అధికారి ఎ. పద్మజారెడ్డి,శివశంకర్‌గౌడ్, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పాపన్నపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోఇ మిన్‌పూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన హన్మంతు రాములు (50) భాగ్యనగరంలో కూలి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. మనువాలి జన్మదినాన్ని పురష్కరించుకుని నాగులు రోజుల క్రితం రాములు ఆదే గ్రామనికి చెందిన కిషన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై పాపన్నటూకు టీ తాగేందుకు వచ్చి టీ సేవించి తిరిగి స్వగ్రామైన మిన్‌పూర్‌కు వెళుతున్న క్రమంలో వాకింగ్ చేస్తున్న మిన్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ను ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న హన్మంతు రాములు, లక్ష్మణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరిలించి ప్రథమ చికిత్స చేసి పరిస్థితి మిషమించడంతో మెరుగైన చికిత్స కోస మెదక్ పట్టణానికి తరలించి ఆసుపత్రిలో చేర్చగా చికిత్స అందుకుంటూరాములు మృతి చెందినట్లు ఎస్సై వివరిం చారు. మృతుడు రాములకు భార్య సునీత, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. క్షతగాత్రుడు లక్ష్మణ్ పరిస్థితి విషయమంగా ఉండటంతో హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించామన్నారు.

## 16 నుంచి ఎన్నికల ప్రచారం షురూ

**న్యాల్‌కల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తారీఖు నుంచి బిఆర్ఎస్ నాయకులు మండలం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు నియోజకవర్గ ఇంచార్జి మాజీ బ్రేవరీస్ కార్పోరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలో న్యాల్‌కల్ మండల బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతిని ధులతో ప్రత్యేంగా సమావేశం అయి ప్రచారం తీరుపై చర్చించారు. బూతు స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పకడ్బందీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తామని దేవి ప్రసాద్, శివకుమార్‌లు పేర్కొన్నారు. బూత్, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేసి ప్రచార రంగంలోకి దూకుతామన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు బోడ స్వప్న భాస్కర్, అంజమ్మ, మున్నూర్ రవీందర్, ఎల్‌చెల్ నర్సింహారెడ్డి, పాండురంగారెడ్డి, రాజ్‌కుమార్ మాతంశెట్టి, బస్వరాజ్, బ్యాత చంద్రప్ప, భూమిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అమీన్,యంఆర్ ప్రవీణ్‌కుమార్, బిరేదార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మోర్గి మోడల్ పాఠశాలలో ఇంటర్న్ షిప్

**నాగల్‌గిద్ద, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని మోర్గి గ్రామంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో శుక్రవారం వృత్తి విద్యా కోర్సులు (అగ్రికల్చర్, ఇంటర్న షిప్) కోర్సులను ప్రిన్సిపాల్ రమేష్, వృత్తి విద్యా కోర్సు శిక్షకులు శేఖర్, ఆశన్నలు ప్రారంభించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అగ్రి మా ఫర్టిలైజర్స్ నిర్వాహకులు కే వీరశెట్టి, ఓంకారేశ్వర హోం నీడ్స్ నిర్వాహకులు సంజీవ్‌కుమార్, కార్యాలయ సబార్డినేట్ నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన అర్జున్‌నాయక్ తండా వాసులు



ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న అర్జున్‌నాయక్ తండా కాంగ్రెస్ శ్రేణులు

**జహీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని అర్జున్ నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వీరు రాథోడ్, పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు గులాల్‌సింగ్, రాథోడ్ మధుల ఆధ్వర్యంలో చేరిన నాయకులను ఎమ్మెల్యే పార్టీ ఖండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఇప్పేపల్లి సొసైటీ చైర్మన్ మచ్చందర్, నాయకులు, ప్రజాప్రతినిధులు మోహియోద్దీన్, ఆకాష్, దేవుజి, జాటోత్ మచ్చేందర్, రాథోడ్ శివ, జాటోత్, విక్రమ్, బి శంకర్, విజయ్, వీరన్న పాటిల్, మోహిజ్, చెంగల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మాడ్గి చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ

**-4లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**



మాడ్గి చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**జహీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కొనసాగుతున్న వాహనాల తనిఖీలో శుక్రవారం పోలీసులు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 4 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జాతీయ రహదారిపై మాడ్గి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద చిరాగ్‌పల్లి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రెండు వాహనంలో తరలిస్తున్న 4 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఒక వాహనంలో 1 లక్ష, మరో వాహనంలో 3 లక్షల రూపాయలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

## రామాయంపేట శివారులో నగదు పట్టివేత



మహిళనుండి నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ రంజిత్‌కుమార్

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 13, ప్రభాతవార్త :** తెలంగాణ జనరల్ ఎలక్షన్స్ 2023లో భాగంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు ఓ మహిళ నుండి నగదును పట్టుకున్నారు. శుక్రవారం నాడు సాయంత్రం నాలుగు గంటల సమయంలో రామాయంపేట ఎస్ఐ రంజిత్‌కుమార్ తన పోలీసు బృందంతో రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సౌందర్య అను మహిళ 90 వేల రూపాయలు తీసుకొని వెళ్తుండగా, ఎలక్షన్ నిబంధనల ప్రకారం 50 వేల రూపాయలకంటే ఎక్కువ నగదు తీసుకుపోకూడదు కాబట్టి నగదును స్వాధీన పరుచుకొని, ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ మోనిటరింగ్ కమిటీ నందు సమర్పించడం జరిగిందని ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపారు.